# <u>పత్రికా ప్రకటన</u>

**తేది.08.12.2017.**

## <u>ఇళ్ళలో దొంగతనాలు చేసే అంతర్ రాష్ట్ర నేరస్థుడు అరెస్ట్</u>

### *సుమారు 10 లక్షల విలువైన 350 గ్రాముల బంగారం స్వాధీనం*

విజయవాడ నగర పోలీస్ కమీషనరేట్ పరిధిలో వివిధ నేరాలను అరికట్టి నిందితులను పట్టుకునేందుకు పోలీస్ కమీషనర్ శ్రీ డి.గౌతం సవాంగ్ ఐపిఎస్ గారి ఆదేశాలపై సిసిఎస్ పోలీసు పోలీసులు నగరంలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో ది.08.12.2017న విజయవాడ బందర్‌రోడ్డులోని చెన్నుపాటి పెట్రోల్‌బంక్ ప్రక్క రోడ్డులో సిసిఎస్ పోలీసుల రాకను గమనించి పారిపోయేందుకు ప్రయత్నించిన ఒక వ్యక్తిని అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించడం జరిగింది.

విచారణలో పట్టుబడిన వ్యక్తి ఇళ్ళలో దొంగతనాలు చేసే అంతరాష్ట్ర పాత నేరస్థుడు దేవరకొండ రాంబాబు (49) గా వెల్లడి కావడంతో ఇతన్ని అరెస్ట్ చేసి, **<u>ఇతని వద్ద నుండి సుమారు రూ.10 లక్షల విలువైన 350 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకోవడం జరిగింది.</u>**

విజయవాడ వాంబేకాలనీకి చెందిన దేవరకొండ రాంబాబు పాత నేరస్థుడు. గతంలో చేసిన ఇళ్ళ దొంగతనాలకు సంబంధించి పలు మార్లు జైలుకు వెళ్ళడం జరిగింది. ప్రస్తుతం ఇతను గుంటూరు జిల్లా, నాదెండ్ల మండలం నందు నివాసం ఉంటున్నాడు. చిన్న వయస్సు నుండి చెడు స్నేహాలు, అలవాట్లకు లోనైన రాంబాబు చిల్లర దొంగతనాలతో ప్రారంభించి, ఇళ్ళలో దొంగతనాలు చేయడం వరకు చేరుకున్నాడు. ఈ క్రమంలో గతంలో నిందితుడు **<u>హైదరాబాద్, సికింద్రాబాద్, కర్నూలు, నల్గొండ, దేవరకొండ మరియు విజయవాడ నగర పోలీస్ కమీషనరేట్ పరిధిలో సుమారు 50 వరకు దొంగతనాలు చేశాడు.</u>** నేర ప్రవృత్తికి అలవాటుపడిన రాంబాబు ఈ మధ్య కాలంలో జైలు నుండి బయటకు వచ్చి తిరిగి ఇళ్ళలో దొంగతనాలకు చేయడం ప్రారంభించాడు.

ఈ క్రమంలో 2017 సం॥ జూన్ నెలలో విజయవాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి జక్కంపూడి కాలనీలో ఉదయం సుమారు 11 గంటల సమయంలో తాళం వేసి ఉన్న ఒక ఇంటి తలుపులు బలవంతంగా నెట్టి, లోనికి ప్రవేశించి బీరువాలో మరియు వంటగదిలో ఉన్న నగదు మరియు నగలను చోరీ చేసి, బయటకు వచ్చిన తరువాత మరో ప్లాటు తలుపు తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న నగదు మరియు నగలను దొంగిలించడం జరిగింది. అలాగే 2017 సం॥ జులై నెలలో విజయవాడ కంకిపాడు పోలీస్‌స్టేషన్ పరిధి న్యూ బ్యాంక్ కాలనీలో రాత్రి సమయంలో ఒక ఇంటి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించి బీరువాలో నగదు నగలు దొంగిలించాడు.

విజయవాడ నగరంలో నేరాలను కట్టడి చేసే క్రమంలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసిన సిసిఎస్ పోలీసులు ది.08.12.2017న విజయవాడ బందర్‌రోడ్డులోని చెన్నుపాటి పెట్రోల్‌బంక్ ప్రక్క రోడ్డులో పారిపోయేందుకు ప్రయత్నించిన నిందితుడిని అరెస్ట్ చేసి, **<u>అతని వద్ద నుండి సుమారు రూ.10 లక్షల విలువైన 350 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకోవడం జరిగింది.</u>**

--xx--